# స్పెయిన్, పోర్చుగల ట్రావెలాగ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి



*(గత సంచిక తరువాయి)*

**11-9-2015 శుక్రవారం**

ఇది అమెరికాలో పద్నాలుగేళ్ళ క్రితం ట్విన్ టవర్స్‌ని ఉగ్రవాదులు కూల్చిన రోజు. ఉదయం ఆరున్నరకి నిద్రలేచాం. రెస్టారెంట్‌లా టెర్మినల్‌లో ఆఖరి బ్రేక్‌ఫాస్ట్ చేసాం. బ్రెడ్ టోస్ట్, బటర్, జామ్, ఏపిల్, అనాస ముక్కలు, ఆరెంజ్ జ్యూస్, గ్రీన్ టీ తీసుకున్నాను. పద్మజ కాఫీ తాగింది. సామాను కిందకి తెచ్చి, తాలం చెవులని రిసెప్షనిస్ట్‌కి ఇచ్చేసి లాబీలో వెయిట్ చేసాం. జయదేవ్ తన రూమ్‌మేట్ బ్రిజ్‌నందన్ గుప్తాని పరిచయం చేసాడు. గుప్తాజీ ఢిల్లీ పెద్ద పారిశ్రామికవేత్త. రిటైరై వ్యాపార బాధ్యతలు కొడుకులకి అప్పగించానని, ప్రస్తుతం వరల్డ్ టూర్ చేస్తున్నానని చెప్పారు. ఈ టూర్ అంతా మేం నలుగురం ఒక బృందంగా కలిసి తిరిగాం. బస్ 8.30కి వచ్చింది. సామానంతా బస్‌లో సర్దాక, అంతా ఎక్కారని దీపక్ రోల్‌కాల్ ద్వారా రూఢీ చేసుకున్నాడు. అరగంట తర్వాత ఉదయం 9కి బయలుదేరాం. ఎప్పటిలా దీపక్ గాయత్రీ మంత్రం చదివాక ప్రోగ్రాం చెప్పాడు.

"మనకి సగం రోజు మేడ్రిడ్ టూర్. అక్కడక్కడా ఫోటో స్టాప్స్ ఉంటాయి. దారిలో మన లంచ్. తర్వాత సాలమాంకాకి వెళ్తాం. అక్కడ హోటల్లో చెకిన్ చేసి సైట్ సీయింగ్ వెళ్తాం. రాత్రి అక్కడే బస. ఐటనరీ ప్రకారం ఈ రాత్రి డిన్నర్ ఎవరిది వారిదే"



గైడ్ అజిత్ సింగ్

దారిలో స్థానిక మేడ్రిడ్ గైడ్ అజిత్ సింగ్ బస్ ఎక్కాడు.

"గుడ్ మార్నింగ్ ఎవ్విరిబడి. మీ టూర్ ఆనందంగా సాగుతోందనుకుంటాను. నా పేరు అజిత్ సింగ్. నేను పదేళ్ళ క్రితం రాజస్థాన్‌లోని ఉదయపూర్ నించి స్పెయిన్‌కి వచ్చాను. ఇంగ్లీష్ అందరికీ ఒకే అనుకుంటాను."

అజిత్ సింగ్ స్పెయిన్ గురించి వివరించాడు.

"స్పెయిన్ పదిహేడు రీజియన్స్‌గా విభజించబడింది. వాటిలో అతి పెద్దది ఉత్తరంలోని కతలూనియా బాస్కో, బార్సిలోనా ఈ రీజియన్‌లోనే ఉంది. దక్షిణ స్పెయిన్‌లోని అండలుసియా బీచేస్‌కి ప్రసిద్ధి. జులై, ఆగస్ట్ నెలల్లో ఇక్కడ ఎండ నలభైనించి నలభై రెండు డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. కాబటి అది పీక్ టూరిస్ట్ సీజన్. 1994లో స్పెయిన్ యూరోపియన్ యూనియన్‌లో చేరింది. ఈయుకి మునుపు కరెన్సీ పెసేటా. ఇప్పుడు యూరో. ఇది డాలర్ తర్వాత బలమైనది. బ్రాండెడ్ ఐటం ఎప్పుడూ బ్రాండెడ్ ప్రైస్‌తోనే వస్తుంది. ఆ జులై నించి 31 ఆగస్ట్ దాకా షాప్స్‌లో 50శాతం డిస్కౌంట్ సేల్ ఉంటుంది. అప్పుడు 20 యూరోల జీన్స్ షార్ట్ పన్నెండు యూరోలకే వస్తుంది. మీరు గమనించే ఉంటారు. ఇక్కడి ఆడవాళ్ళు చాలా అందగత్తెలు. లావుగా ఉండరు. ఇక్కడి మెట్రో రైళ్ళు, బస్‌లు ఏర్ కండిషన్డ్. టిక్కెట్ ధర అర యూరో.


బుల్ రింగ్

పర్యాటకులు ఏడు రోజుల పాస్‌తో ఏ బస్ లేదా ఏ మెట్రో రైలైనా ఎక్కచ్చు. రోజుకి 12 యూరోల పాస్‌ని కూడా కొనచ్చు. పాస్‌పోర్ట్ నంబర్ ఇవ్వాలి. ఇక్కడ పనిచేసే విదేశీ ఉద్యోగస్థులకి నాలుగేళ్ళకి పర్మనెంట్ రెసిడెన్సీ (పి ఆర్) వస్తుంది. స్పెయిన్‌లో ప్రస్థుతం నిరుద్యోగం 55 శాతం. ప్రతీ ఇద్దరిలో ఒకరికి ఉద్యోగం లేదు. హెల్త్ కేర్ ఉచితం."

9.30కి బుల్ రింగ్ దగ్గర మా మొదటి ఫోటో స్టాప్. అజిత్ సింగ్ చెప్పాడు.

"దీన్ని 1923లో నిర్మించారు. ఇది అతి క్రూరమైన క్రీడ. దాన్ని చూడటానికి 15 నించి 75 యూరోల టిక్కెట్లు ఉంటాయి. లోపల బుల్ ఫైట్స్ వచ్చే వారం ఆరంభమవుతాయి. సంవతరానికి రెండు, మూడుసార్లే ఇక్కడ బుల్ ఫైట్స్ జరుగుతాయి. స్పెనిష్ కాలనీ ఐన మెక్సికోలో కూడా బుల్ ఫైటింగ్ క్రీడ ఉంది. పాతిక వేలమంది పట్టే రెండో పెద్ద బుల్‌రింగ్ మెక్సికో సిటిలో ఉంది."


ఎత్తయిన గోడల మీద దున్నపోతుల విగ్రహాలు

పేరుకి తగ్గట్టే అది గుండ్రంగా ఉంది. ఎత్తయిన గోడల మీద దున్నపోతుల విగ్రహాలున్నాయి. అక్కడ ఫోటోలు తీసుకుని మళ్ళీ బస్సెక్కాం. బస్ మేడ్రిడ్ వీధుల్లో ప్రయాణించి అల్కలా గేట్ దగ్గర ఆగింది.

"అల్కలా ది హెనారెస్ అనే సిటీకి వెళ్ళే దారి కాబట్టి ఈ పేరు వచ్చింది. గేట్ ఆఫ్ అల్కలా మేడ్రిడ్‌లోని అతి పొడవైన, అతి పురాతన వీధుల్లో ఒకటి. నగర శివార్లలోకి వెళ్ళే దీని మొత్తం పొడవు పదకొండు కిలోమీటర్లు. 1772లో దీన్ని ఆరంభించి 1778లో పూర్తిచేసారు. ఈ మార్గంలోనే ప్రముఖమైన అనేక కట్టడాలున్నాయి."

ఆ వీధిలో అటు ఇటూ షాప్స్, పాత భవనాలు, బేంక్ ఆఫ్ స్పెయిన్ మొదలైనవి ఉన్నాయి. చాలామంది కిటికీలోంచి ఫోటోలు తీసుకున్నారు. ఇండిపెండెంట్ స్క్వేర్ కుడివైపు వినియారెస్ పేలస్ చారిత్రాత్మక బిల్డింగ్స్ చూపించి అక్కడ సంపన్నులైన వ్యాపారస్థులు నివశిస్తారని చెప్పాడు.

"బేంక్ ఆఫ్ స్పెయిన్ బిల్డింగ్ చారిత్రాత్మకమైనది. ఛార్ల్స్ -3 కట్టించిన దీన్ని 1782లో స్థాపించారు. 1999లో దీన్ని ప్రాపర్టీ ఆఫ్ కల్చరల్ ఇంట్రస్ట్‌గా డిక్లేర్ చేసారు."

బస్ ఇంకొంచెం దూరం వెళ్ళాక గైడ్ అజిత్ సింగ్ చెప్పాడు.

"మనం ఉన్నది ప్లాజా ద కోలోన్. అంటే కొలంబస్ స్క్వేర్. కొలంబస్ స్పేనిష్ పేరు క్రిస్టోబాల్ కోలోన్. దీనికి ఈ పేరు రావడానికి కారణం ఇక్కడున్న క్రిస్టఫర్ కొలంబస్ విగ్రహం. కుడివైపు చూస్తే మీకు అది కనిపిస్తుంది. దీన్ని కొలంబస్‌కే అంకితం ఇచ్చారు. 56 అడుగుల ఎత్తు పునాది మీద ఓ స్థూపం, దానిమీద స్థంబం, దానిమీద ఇటలీలో తయారైన పదకొండు అడుగుల ఎత్తుగల పాలరాతి క్రిస్టఫర్ కొలంబస్ విగ్రహం ఉన్నాయి. 1864లో క్రిస్టఫర్ కొలంబస్‌కో చిహ్నాన్ని నిర్మించాలనే ఆలోచన రెండవ ఇసబెల్లాకి వచ్చింది. కాని 1868లో జరిగిన తిరుగుబాటు వల్ల అది అమలు కాలేదు. 1877లో దీని నిర్మాణ డిజైన్‌కి పోటీని నిర్వహించారు. అర్టురో మెయిల్డా డిజైన్ గెలుచుకుంది. 1881-1885ల మధ్య దీని నిర్మాణం ఇటలీ జరిగింది. 4-1-1886న దీనికి ప్రారంభోత్సవం జరగాల్సి ఉంది. కాని రాజు మరణం వల్ల అది వాయిదా పడింది. ఓ చేతిలో కేస్టైల్ జండాని పట్టుకున్న ఆ విగ్రహం 1892లో ఇటలీనించి చేరుకుంది. 1976లో దీన్ని

పడగొట్టి మరో చోటకి మార్చారు. కాని 2009లో మళ్ళీ దాన్ని ఇక్కడికి అంటే యథాస్థానానికి మార్చారు. ఇది చారిత్రాత్మక వ్యక్తి విగ్రహం. ఇతనెవరో తెలుసా?" గైడ్ అడిగాడు.

"అమెరికాని కనిపెట్టాడు" చాలామంది చెప్పారు.

తర్వాత నేషనల్ లైబ్రరీ బిల్డింగ్‌ని చూపించి చెప్పాడు.

"ఐదవ ఫిలిప్ కట్టించిన దీర్ఘచతురస్రాకారంలోని ఆ నేషనల్ లైబ్రరీ బిల్డింగ్ 1866లో ఆరంభమై, 1892లో పూర్తయింది. దీన్ని కొలంబస్ అమెరికాని కనిపెట్టిన 4వ సెంటినరీ సందర్భంగా కట్టారు. ఆ ఎత్తైన టవర్స్ కొలోన్ టవర్స్ లేదా కొలంబస్ టవర్స్ ట్విన్ టవర్స్. 1976లో నిర్మించిన, 23 అంతస్థుల ఈ టవర్స్‌లో ఆఫీస్‌లు పని చేస్తున్నాయి. దీని ఎత్తు 380 అడుగులు."

మా బస్ పాబ్లో పికాసో స్క్వేర్‌కి చేరుకున్నాక బస్‌లోంచి పికాసో టవర్ని చూపించి అజిత్ సింగ్ చెప్పాడు.

"అమెరికాలో జపనీస్ వలసదారులకి పుట్టిన మినోరు యమసాకి పికాసో టవర్ని డిజైన్ చేసాడు. న్యూయార్క్‌లోని మాయమైన వరల్డ్ ట్రేడ్ సెంటర్ని కూడా ఈయనే డిజైన్ చేసాడు. 1982 -1988 మధ్య దీని నిర్మాణం జరిగింది. 18 లిఫ్టులు. 515 అడుగుల ఎత్తు. సెల్లార్‌లో ఐదు, పైన నలభై ఆరు అంతస్థులు ఉన్నాయి. దాని నిర్మాణానికి అప్పట్లో 43కోట్ల 50 లక్షల యూరోలు ఖర్చయింది. ఇందులో అన్నీ ఆఫీస్‌లే ఉన్నాయి. రూఫ్ టాప్ మీద హెలిపేడ్ ఉంది."

పక్కనే ఉన్న 'పసో ద లా కేస్టలీనా'ని చూపించాడు. అది కవచం ధరించి ఓ చేత్తో గుర్రపు కళ్ళాన్ని, మరో చేతిలో సెప్టర్ (గదలాంటి దండం) ధరించిన బ్రాంజ్ విగ్రహం.

"ఇస్‌బెల్లా ఆఫ్ కే స్టైల్‌కి అంకితం ఇచ్చిన విగ్రహం అది. రోమ్‌లో తయారుచేసి ఇక్కడికి తెచ్చిన దీన్ని 30 నవంబర్ 1883న ఆవిష్కరించారు" చెప్పాడు.

దారిలో యు.ఎస్.ఎంబసీ కనిపించడంతో అమెరికా నించి వచ్చిన ఇండియన్స్ దాన్ని చూసి 'వావ్' అన్నారు.

మేడ్రిడ్ గోల్డెన్ మైల్ (మిలా ద ఆరో) సమీపంలో 1970లో డిస్కు బ్రిమియంటో గార్డెన్స్‌ని 1.87 హెక్టార్ల విస్తీర్ణంలో నిర్మించారు. ఇది అమెరికా కనిపెట్టబడటానికి అంకితం చేసారు. ఇక్కడి జాక్విన్ వాక్వెరొ టార్సియస్ 1977లో చెక్కిన ఫ్రాన్సిస్కో ఫ్రాంకో గుర్రం మీద కూర్చున్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇంకా ఇక్కడ మూడు పెద్ద కాంక్రీట్ స్థంభాలు, రిలీఫ్ మోటిఫ్స్ కూడా ఉన్నాయి.

ఫ్రాన్సిస్కో ఫ్రాంకో స్పెయిన్‌ని ఇటీవలదాకా పాలించిన ఓ గొప్ప నేత. జులై 1936లో ఫ్రాంకో మిలటరీ కుట్ర ద్వారా స్పెయిన్‌ని వశపరచుకోవాలని అనుకున్నాడు. కానీ అందులో విజయం సాధించలేకపోవడంతో 1936 - 1939 మధ్య స్పేనిష్ సివిల్ వార్ (అంతర్యుద్ధం) జరిగింది. అందులో గెలిచి 1975దాకా ఫ్రాంకో స్పెయిన్‌ని నియంతగా పాలించడు. ఇతని శవాన్ని మొదట మేడ్రిడ్ శివార్లలోని వేలీ ఆఫ్ ది ఫాలెన్ అనే, సివిల్ వార్లో మరణించిన వేలకొద్దీ సైనికుల దేహాలని ఖననం చేసిన చోట ముసోలియంలో పాతిపెట్టారు. స్పేనిష్ ఫాసిస్టులకి అది యాత్రాస్థలంగా మారి ఆరధనాలయమైతే, కొందరు అసహ్యించుకునే ప్రదేశమైంది. 2019లో ఫ్రాంకో శవాన్ని అక్కడ నించి తీసి మేడ్రిడ్‌లోని అతని భార్య సమాధి పక్కన ఖననం చేసారని చదివాను. అతని వ్యతిరేకులు, మద్దతుదారులు అడ్డుపడకుండా దాన్ని హెలికాప్టర్‌లో తరలించారు.

రోడ్ పక్కన బిల్డింగ్స్‌లోని ఓ చెట్టు కాండం నరకకుండా బిల్డింగ్‌లోంచి పైకి ఎదగడం కనిపించింది. రోడ్ మీద జాగింగ్ చేసే అనేకమంది కనిపించారు.

ఉదయం పదకొండు అవడంతో ట్రాఫిక్ పెరిగింది. మా రెండో ఫొటో స్టాప్ 85,000 సీట్లున్న స్టేడియం ఎస్టారియో శాంటియాగో బెర్నాబ్యూ. ఇక్కడ ఫుట్‌బాల్ (సాకర్) ఆటలు జరుగుతూంటాయి. మనకి క్రికెట్ ఎలా అభిమాన క్రీడో స్పేనిష్ వారికి ఫుట్ బాల్

అభిమాన క్రీడ. వారి ఫేన్ క్లబ్స్ మధ్య పోటీ ఉంది. ఆటల సమయంలో వారి మధ్య అల్లర్లు జరక్కుండా పోలీసులు ట్రాఫిక్‌లో, స్టేడియంలో అప్రమత్తంగా ఉంటారు. దాన్ని బయటనించే చూసాం.

ఇది రాస్తున్నప్పుడు ఎవరో నాకు పంపిన ఓ వార్తని చదివాను. పోర్చుగీస్ సాకర్ క్రీడాకారుడు రోలెండ్ క్రిస్టియానో రొనాల్డో ఓ సమావేశంలో తనముందు బల్లమీదున్న కోకోకోలా సీసాని చూసి 'కోక్‌ని తాగొద్దు. దీన్ని ఎంకరేజ్ చేయద్దు. దాహం వేస్తే మంచినీళ్ళు తాగండి' అని సూచించాడు. మర్నాడు కోకోకోలా షేర్లు 30వేల కోట్ల రూపాయలు నష్టపోయాయిట. 30వేల కోట్లు ఎక్కువేమో కానీ అతని ఫాన్స్‌లో చాలామంది అతని మాటని వింటారు కాబట్టి షేర్ల మీద మాత్రం అతని సూచన ప్రభావం పడింది.

బయటనించి ఫోటోలు తీసుకున్నాం. ఆ దారిలో పేరు తెలీని చాలా హిస్టారికల్ బిల్డింగ్స్ కనపడ్డాయి. అన్ని మాన్యుమెంట్స్ వైభవంగా ఉన్నాయి.


సాధువుల స్టైల్లో బెగ్గర్స్

అరగంట తర్వాత 11.32కి పూర్టా డెల్ సో (గేటాఫ్ ది సన్)లో బస్ దిగాం.

"ఇది మేడ్రిడ్‌లోని బిజీ సెంటర్లలో ఒకటి. ఇది మేడ్రిడ్‌కి సరిగ్గా సెంటర్‌లో ఉంది. దీన్ని కిలోమీటర్ జీరో అంటారు. కారణం స్పేనిష్ రోడ్లన్నీ ఇక్కడనించే ఆరంభమవుతాయి. ఈ స్క్వేర్‌లో ప్రఖ్యాత క్లాక్ ఉంది. కొత్త సంవత్సరం రాగానే అది మోగగానే, అంటే అర్ధరాత్రి పన్నెండుకి, ఒకో గంటకి ఒకో ద్రాక్షపండు చొప్పున పన్నెండు ద్రాక్షపళ్ళని తినే సంప్రదాయాన్ని ప్రజలు ఇక్కడ పాటిస్తారు పదిహేనవ శతాబ్దం నించే ఈ స్క్వేర్ ఉంది. దీని చుట్టూనే మేడ్రిడ్ అభివృద్ధి చెందింది."

దూరంగా ఉన్న ఎలుగుబంటి విగ్రహాన్ని చూపించి అజిత్ సింగ్ చెప్పాడు.

"బస్‌ని మీరు మళ్ళీ అక్కడే ఎక్కాలి. ఈ విగ్రహాన్ని గుర్తుంచుకోండి. దీని పేరు 'ది బేర్ అండ్ ది స్ట్రాబెర్రీ ట్రీ'. దీన్ని మేడ్రిడ్ నగర కోట్ ఆఫ్ ఆర్మ్స్‌గా ఆంటోనియో నవారో శాంటాఫీ అనే శిల్పి చెక్కాడు. జనవరి 1967లో దీన్ని ఆవిష్కరించారు. అదీ దీని చరిత్ర. మీకు సరిగ్గా అరగంట టైం ఉంది. అంటే పన్నెండుకి ఎక్కాలి. మాల్లో రెస్ట్‌రూమ్స్ లేవు. అవసరమైన వారు అందులోని ఏదైనా రెస్టారెంట్‌కి వెళ్ళి, ఏదైనా తిని, అక్కడ రెస్ట్ రూంని ఉపయోగించుకోండి. మేడ్రిడ్‌లో దొంగలు ఎక్కువ అని గుర్తుంచుకోండి. మీరు దిగే ఇది పికప్ ప్లేస్ కాదు. పన్నెండు దాకా బ్రేక్. ఎలుగుబంటి విగ్రహం దగ్గరకి రండి. అది పికప్ ప్లేస్." గైడ్ హెచ్చరించాడు.

మాల్ పక్కనే స్పేనిష్ పార్లమెంట్ బిల్డింగ్, వెస్టిన్ పేలస్ హోటల్ (ఫైవ్ స్టార్ హోటల్) ఉన్నాయి. ఓ చోట రోడ్‌ని తవ్వుతూ, దుమ్ము పైకి లేవకుండా వెంటనే నీటిని చల్లుతున్నారు. మాల్‌లోని ఫుడ్ కోర్ట్‌లో వెజిటేరియన్ ఐటమ్స్ ఏవో దొరక్క అక్కడ ఏం తినలేదు. మూడు యూరోలకి ఒకటీ చొప్పున సేల్‌లోని రెండు హేండ్ బేగ్స్, ఆరు యూరోలకి ఓ సావనీర్ కప్పుకొన్నాం. అన్ని సావనీర్ కప్పు కొన్నాం. అన్ని సావనీర్ షాపుల్లోని వస్తువుల ఖరీదు మూడు నించి పది యూరోల దాకా ఉంది. పక్కనే ఉన్న పార్క్ ద మేడ్రిడ్ అనే పెద్ద గార్డెన్‌లో పిక్నిక్‌కి చాలామంది వచ్చారు. కొందరు జాగింగ్ చేస్తున్నారు. అక్కడ రెండు గుర్రాల మీద నిలబడ్డ విగ్రహంలోని వ్యక్తి గాడ్ ఆఫ్ స్పోర్ట్స్ అని గైడ్ చెప్పాడు.

రొమేనియా నించి వచ్చిన కాందిశీకులు మేడ్రిడ్‌లో చాలామంది ఉన్నారు. వారిలోని సర్వం కోల్పోయి వచ్చిన ఓ బిచ్చగాడికి నాలుగు యూరోలు ఇచ్చాను. వెంటనే నలుగురైదుగురు నా చుట్టూ గుమిగూడారు. వారి ముందు పర్స్ తెరిస్తే లాక్కుని పారిపోయేలా ఉన్నారు కాబట్టి వారిని తప్పించుకుని బస్ దగ్గరకి చేరుకున్నాను.

దారిలో అక్కడి ప్రఖ్యాత బిల్డింగ్స్‌లో ఒకటి సిబిలెస్ పేలస్. అంత అద్భుతమైన వైభవంగా ఉన్న బిల్డింగ్‌ని మన దేశంలో అయితే మినిస్టర్లు తమ నివాసంగా చేసుకునేవారు. కానీ దాన్ని పోస్టల్, టెలిగ్రాఫ్, టెలీఫోన్ హెడ్ క్వార్టర్స్‌గా ఉపయోగించారు. ప్రస్తుతం ప్రెసిడెంట్ ఆఫ్ మేడ్రిడ్ ఆఫీస్‌గా పబ్లిక్ కల్చరల్ సెంటర్‌గా, సిటీ హాల్‌గా కూడా ఉపయోగిస్తున్నారు. ఛార్లెస్ -3 విగ్రహాన్ని అజిత్ సింగ్ చూపించాడు. 12కి బస్ బయలుదేరింది. ఒంటి గంటకి ఆగ్రా పేలస్ అనే ఇండియన్ రెస్టారెంట్లో లంచ్‌కి చేరుకున్నాం.

శెనగల కూర, పూరీ, వెజ్ బిర్యాని, అప్పడం, పెరుగు, ఐస్ క్రీం, టీ ఇచ్చారు. బఫేకాదు. వడ్డించారు. లంచ్ తర్వాత 1.45కి సగం రోజు మేడ్రిడ్ టూర్ ముగించుకుని సాలమాంకాకి బయలుదేరాం.

"మేడ్రిడ్‌లో మూడు రింగ్ రోడ్స్ ఉన్నాయి. వాటి పేర్లు హైవే ఎం 30, ఎం 40, ఎం 50. వీటివల్ల మేడ్రిడ్ నగరంలోంచి త్వరగా బయటకి వెళ్ళిపోవచ్చు." ఓ రింగ్ రోడ్‌కి దారిని చూపించి అజిత్ సింగ్ చెప్పాడు.

రెండున్నరకి అజిత్ సింగ్ అందరికీ గుడ్ లక్ చెప్పి దిగిపోయాడు. ఏ సిటీ ఐనా ఇలా బస్‌లోంచి కాక కొన్ని రోజులు నడిచి చూస్తేనే దాన్ని సరిగ్గా చూసినట్లు. కానీ అది అందరికీ సాధ్యంకాదు. స్థానికులు తెలిసి ఉంటే తేలిక. మేం మిస్సైనవి, అంటే మా ఐటనరీలో లేనివి చాలా ఉన్నాయి.

మా బస్ సోలమాంకాకి కొనసాగింది. నాలుగున్నరకి ఓ షాపింగ్ కాంప్లెక్స్ దగ్గర కంఫోర్ట్ స్టాప్‌గా ఆపారు.


సాలమాంకా గైడ్

"ఇక్కడ పది నిమిషాలు మాత్రమే ఆగుతుంది. దయచేసి షాపింగ్‌కి వెళ్ళకుండా బాత్‌రూం పని పూర్తిచేసుకుని వచ్చేయండి" దీపక్ అందరికీ మైక్‌లో చెప్పాడు.

మళ్ళీ నాలుగుం ముప్పావుకి బయలుదేరి మేం సాలమాంకాకి ఐదు నలభై ఐదుకి చేరుకున్నాం. దారిలో దీపక్‌కి ఫోన్ చేసి మా స్థానిక గైడ్ మాకోసం ఎక్కడ ఎదురు చూస్తున్నాడో చెప్పాడు. అతన్ని ఎక్కించుకున్నాం. అతను చెప్పాడు.

"మనం మీ హోటల్‌కి వెళ్ళినా మళ్ళీ వెనక్కి ఇక్కడికి రావాలి. మనం దారిలో ఓల్డ్ సిటీని చూసుకుని వెళ్దాం. సిటీ వాల్ దగ్గర రెండు గంటల వాకింగ్ టూర్. ఏమంటారు?"

అంతా అందుకు అంగీకరించాక బస్ ముందుకి సాగింది. ముందుగా 2,000 ఏళ్ళ క్రితం నిర్మించిన రోమన్ బ్రిడ్జ్‌కి చేరుకున్నాం. చారిత్రాత్మక నిర్మాణమైన అక్కడ ఫోటోలు తీసుకున్నాం.

"టోర్మెస్ నది మీద సాలమాంకాకి దక్షిణం వైపు నిర్మించిన, దీన్ని ప్యూంటే మాయర్ ద టోర్మెస్, ప్యూంటే ప్రిన్స్‌పల్ (మెయిన్ బ్రిడ్జ్) అనికూడా పిలుస్తారు. ఈ బ్రిడ్జ్ సాలమాంకా నగరానికి చిహ్నం. ఇప్పుడు కనిపించే ఈ వంతెనకి అనేకసార్లు మరమ్మత్తులు జరిగాయి. హైవే ఎదురుగా ఉన్న దీన్ని 1973దాకా ఉపయోగించారు. ఇంకో బ్రిడ్జ్ కట్టాక ఇప్పుడు దీన్ని కేవలం పాదచారులకే పరిమితం చేసారు. 5వ శతాబ్దపు ఆ సిటీ వాల్ కప్ప సాలమాంకా వాసులకి లక్కీ సింబల్." గైడ్ చెప్పాడు.

తర్వాత ఓల్డ్ కెథడ్రిల్‌కి చేరుకున్నాం.

"సాలమాంకాని గోల్డెన్ సిటీ అంటారు. ఇది సముద్ర మట్టానికి 2,500 అడుగుల ఎత్తున ఉంది. ఇక్కడ రెండు కేథడ్రిల్స్, రెండు యూనివర్సిటీలు ఉన్నాయి. మీరు చూసే వీజా ద శాంటా మారియా అనే కేథడ్రిల్ ప్రముఖమైంది. బిషప్ జెరోమ్ పేరీ గోల్డ్ దీన్ని పన్నెండవ శతాబ్దంలో రోమ నెస్క్యూ ఆర్కిటెక్చర్‌తో ఆరంభించాడు. కానీ 14వ శతాబ్దంలో గోథిక్ స్టైల్‌లో ఇది పూర్తైంది. దీన్ని సెయింట్ మేరియా ఆఫ్ సైట్ (చూపు)కి అంకితమిచ్చారు."

ఈ చర్చ్ బయట నించే చూసి ఫోటోలు తీసుకున్నాం. తర్వాత ఇంటర్నెట్లో చూస్తే కెథడ్రిల్‌లోని ఏప్స్‌లో (తూర్పు చివర అర్ధ చంద్రాకారం డోమ్‌లో గల గూడు) డెలో ఢిల్లీ గీసిన 53 చిత్రాలు కనిపించాయి. వాటిమీద పెద్ద ఫైనల్ జడ్జిమెంట్ ఫ్రెస్కో ఉంది.

తర్వాత దానికి ఆనుకున్న న్యూ కెథడ్రిల్‌కి వెళ్ళాం.

"1513 గోథిక్ స్టైల్‌లో ఫెర్డినాండ్ - 5 ఆఫ్ కేస్టిల్ ఆరంభించిన ఈ కేథడ్రిల్ నిర్మాణం 1733లో బరోక్ స్టైల్‌లో కానీ పూర్తికాలేదు. 14,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న దిని నిర్మాణానికి 220 ఏళ్ళు పట్టింది. ఆర్కిటెక్చర్‌లని బట్టి ఏ భాగం ఏ కాలంలో నిర్మించారో తెలుసుకోవచ్చు. 1887లో దీన్ని జాతీయ మేన్యుమెంట్‌గా రాజు ప్రకటించాడు. 31 అక్టోబర్ 1755లో లిస్బన్‌లో వచ్చిన భూకంపానికి బెల్ టవర్ ఎడమ వైపు దెబ్బతింది. కిటికీలు, గొడల్లోని పగుళ్ళు నేటికీ కనిపిస్తాయి. ప్రతీ 31 అక్టోబర్‌న స్థానికులు జ్ఞాపకంగా ఆ కెథడ్రిల్ కప్పు మీదకి ఎక్కి ఫ్లూట్‌లని, డ్రమ్ములని వాయిస్తారు. 1992లో రినోవేషన్ చేసినప్పుడు ముందు గోడకి అమర్చిన శిల్పాల్లో ఒకటి ఏస్ట్రోనాట్. మరోటి ఐస్ క్రీం కోన్ పట్టుకున్న ఫాన్ (రోమన్ పురాణాల్లో గ్రామ దేవతల్లో మేక కొమ్ములు, చెవులు, కాళ్ళు తోక గల మనిషి బొమ్మ) లోపల కొన్ని బైబిల్ చిత్రాలు కూడా ఉన్నాయి. ఇక్కడ దానికి జతగా తర్వాత కట్టిన మరో కేథడ్రిల్‌ని న్యూ కేథడ్రిల్ ఆఫ్ సాల్‌మాంకా అంటారు. ఈ రెండూ కలిసే ఉంటాయి. దాన్ని బరోక్ ఆర్కిటెక్చర్‌లో నిర్మించారు. నిర్మాణంలో ఉపయోగించిన రాతి రంగుల్లోని తేడాని బట్టి కూడా ఈ రెంటిని కనుక్కోవచ్చు. అక్కడి తలుపు 350 సంవత్సరాల నాటిది."

ఆ తలుపు ముందు నించుని చాలామంది ఫోటోలు తీసుకున్నారు. గైడ్ కొనసాగించాడు.

"ఇక్కడ ఫేక్టరీలు ఏమీలేవు కాబట్టి గాలి శుభ్రంగా ఉంటుంది. నెలకి వెయ్యి యూరోలతో సాలమాంకాలో జీవించచ్చు. ఇక్కడి యూనివర్సిటీ ఆఫ్ సాలమాంకా స్పెయిన్‌లోని అతి ప్రాచీన యూనివర్సిటీ. 1130 మునుపు నించే ఉన్నా 1254 నించి ఇది పనిచేస్తోంది. అందువల్లే ఈ టౌన్ ఏర్పడింది. దీని ముందు ఓ కప్ప బొమ్మ ఉంటుంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఫెయిలైన వారు చిన్న తలుపులోంచి బయటకి వస్తారు. దానికి డాంకీస్ డోర్ అని పేరు. పాసైన వారు మెయిన్ డోర్‌లోంచి వస్తారు. సోలమాంకా రక్షణకి పనికొస్తుందా అని తెలుసుకోడానికి స్పెనిష్ నియంత ఫ్రేంకో దీన్ని సందర్శించాడు. దీంట్లో ఫ్రేంకో నివశించాడు. అప్పట్లో దీన్ని స్పేనిష్ ఆర్మీ హెడ్ క్వార్టర్స్‌గా ఉపయోగించారు. 144 సంవత్సరాల క్రితం కేలిఫోర్నియా నించి తెచ్చిన రెడ్‌వుడ్ చెట్లని ఇక్కడ నాటారు. ఆనాడు కట్టిన భవంతులు ఇంకా పటిష్టంగా ఉన్నాయి. ఇవన్నీ సమీపంలోని గ్రామంలోంచి తెచ్చిన సేండ్ స్టోన్‌తో నిర్మించబట్టి బంగారు రంగులో ఉండేవి. కానీ సేండ్ స్టోన్‌తో నిర్మించిన ఆ గోడల రాళ్ళు కాల్రక్రమేణా తెలుపు రంగులోకి మారాయి. ఒకప్పటి ఛాన్సలర్ ఇంటిని 1919లో పబ్లిక్ లైబ్రరీగా మార్చారు. ఇందులోనే చీఫ్ పోలీస్ ఆఫీసర్ ఆఫీస్ ఉంది. సాలామాంకాలో కూడా ఓ బుల్ రింగ్ ఉంది. ఈ పాత సిటీ మొత్తం వరల్డ్ హెరిటేజ్ సెంటర్‌గా ఎంపికైంది."

ఆ కట్టడాలు చూస్తూ నడుస్తూ, సాలమాంకా సెంటర్లో కట్టిన ప్లాజా మాయర్ (మెయిన్ స్క్వేర్) కి చేరుకున్నాం.



షెల్ హౌస్

"దీన్ని 18వ శతాబ్దంలో బరోక్ స్టైల్‌లో నిర్మించారు. చాలా విశాలమైన ఈ పబ్లిక్ స్క్వేర్‌కి మనుషులు షాపింగ్‌కి, సరదాగా వస్తూంటారు. చుట్టుపక్కల వరసగా రెస్టరెంట్స్, ఐస్ క్రీం పార్లర్స్, సావనీర్ షాప్స్, బంగారు ఆభరణాల షాప్స్, ఓ ఫార్మసీ ఉన్నాయి. ఇక్కడే సిటీ హాల్ కూడా ఉంది. దీన్ని సాలమాంకా హృదయంగా భావిస్తారు. అక్కడ ప్రతీ ఆదివారం లైవ్ కాన్సర్ట్ జరుగుతుంది. 1936లో ఆరంభమైన స్పానిష్ సివిల్ వార్ ఇక్కడా జరిగింది. ఆ నాటి 39 డాక్యుమెంట్స్ ఇక్కడ భద్రంగా ఉన్నాయి" గైడ్ చెప్పాడు.

ప్లాజాలోకి వెళ్ళే చోట చక్కటి ఆర్చేస్‌ని నిర్మించారు. ఆ సిటీ స్క్వేర్ అనేక షాపులు, ఫుడ్ కోర్ట్‌లు, రకరకాల మనుషులతో సందడిగా కళకళలాడుతోంది. ఈ రాత్రి డిన్నర్ మాదే కాబట్టి అక్కడే తినమని దీపక్ చెప్పాడు. మేము పీజా మార్గరీటా, పీజా మష్‌రూం తిన్నాం. ఒకోటి 11.50 యూరోలు.

తిరిగి వచ్చేప్పుడు ఆల్చిప్పలు అతికించిన ఓ పేలస్ కనిపించింది. గైడ్ దాన్ని చూపిస్తూ చెప్పాడు.

"ఇది 1493 - 1517 మధ్య నిర్మించిన 'కసా ద లాస్‌కాంజాస్' (షెల్ హౌస్) అనే మేన్షన్. ఇది కూడా సాలమాంకాకి చిహ్నంగా ఉంది. దీని ముందు భాగాన్ని గోథిక్, ప్లాటరెస్క్యూ స్టైల్‌ని మిళితం చేసి నిర్మించి, మూడు వందల ఏభై షెల్స్‌తో అలంకరించారు. ఈ బిల్డింగ్‌లో అనేక కోట్ ఆఫ్ ఆర్మ్స్ ఉన్నాయి."

దానిముందు నిలబడి ఫోటోలు తీసుకున్నాం.

అంతా కోచ్ ఎక్కాం. మధ్యలో ఓ చోట గైడ్ దిగిపోయాడు. అతని పేరు అడిగి రాసుకోవడం మర్చిపోయాను.

హోటల్‌కి చేరుకోబోయే ముందు దీపక్ చెప్పాడు.

"డిన్నర్‌కి లాబీలో రాత్రి ఏడు నలభై ఐదుకి కలుద్దాం. వేకప్ ఏడు. బ్రేక్‌ఫాస్ట్ ఎనిమిది. అవుట్ తొమ్మిది."

ఒకరు ఆరున్నరకి వేకప్ కాల్‌ని కోరారు. దానికి దీపక్ ఇలా చెప్పాడు.

"నా టైమింగ్స్ ఏడు, ఎనిమిది, తొమ్మిది. మీరు తయారవడానికి అదనంగా కావాల్సి వస్తే, ఇతరులని అనవసరంగా అరగంట ముందు ఎందుకు లేపాలి? మీరు ఆరున్నరకే లేవదలచుకుంటే రిసెప్షనిస్ట్‌ని ఆ సమయంలో వేకప్ కాల్ ఇవ్వమని కోరండి. ప్రతి వారికి మొబైల్స్ ఉన్నాయి కాబట్టి ఫోన్ అలారం పెట్టుకోండి. నా దగ్గర మూడు మొబైల్స్ ఉన్నాయి. రెండు ఫెయిలైనా ఒకటి పనిచేస్తే చాలు. ఎన్.ఓ.టి.సి గైడ్స్ అంతా ఇదే పద్ధతిని అనుసరిస్తాం."

అక్కడ నించి హోటల్ మోంటాల్వోకి పది నిమిషాల్లో చేరుకున్నాం. అది ఒకే అంతస్థు ఉన్న చిన్న హోటల్. కానీ సౌకర్యంగా ఉంది. పగలంతా ప్రయాణం అవడంతో వెంటనే నిద్రపట్టేసింది.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in

*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*